# పదో తరగతి పాసైతే చాలు

## పాలిటెక్నిక్ అడ్మిషన్‌పై తగ్గిన ఏఐసీటీఈ

హైదరాబాద్, న్యూస్‌లైన్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షయిన పదో తరగతిలో 50% మార్కులు(రిజర్వేషన్ వారికి 45%) ఉండాలన్న కొత్త నిబంధనపై అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) వెనక్కి తగ్గింది. పదో తరగతి పాసైతే చాలన్న పాత నిబంధననే పునరుద్ధరించింది. వేర్వేరు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేర డానికి రాష్ట్ర ప్రభుత్వం 'సీప్' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా పదో తరగతి పాసైన వారికి అడ్మిషన్ కల్పిస్తున్నారు. అయితే 2011-12లో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవే శాలకు కిందిస్థాయి అర్హత పరీక్షలో కనీసం 50 మార్కులు సాధించి ఉండాలంటూ ఇటీవలే ఏఐసీటీఈ కొత్త నిబంధన తీసుకొచ్చింది. కొన్ని కోర్సులకు ఈ నిబంధన నుంచి మిన హాయించాలని ప్రభుత్వం కోరినా అంగీకరించలేదు. అయితే తాజాగా ఒక్క పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశాలకు మాత్రమే పదో తరగతి పాసైతే చాలని ఏఐసీటీఈ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. అంటే టెన్త్‌లో 50 మార్కులు ఉండాలన్న నిబంధనని సడ లిస్తూ 35 శాతం మార్కుల పాత నిబంధనని పునరుద్ధరించింది. డీ-ఫార్మసీకి కూడా 35% మార్కులుంటే చాలని పేర్కొంది. డిప్లొమా స్థాయిలోనే ఆర్కిటెక్చర్, హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ, అప్లయిడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ తదితర కోర్సులకు కూడా 35% పాస్ మార్కులు చాలని పేర్కొంది. ఇంజనీరింగ్, బీఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు మాత్రం కిందిస్థాయి అర్హత పరీక్షల్లో 50% మార్కులు(రిజర్వేషన కేటగిరీలకు 45%) ఉండాల్సిందేనని స్పష్టం చేసింది.